క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న స్నేహితులు

కూసుమంచి: తమ స్నేహితుడు మృతిచెందగా.. అతడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని భగవాన్‌తండాకు చెందిన అజ్మీరా సురేశ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా.. ఆయనతో 2004–05లో చదువుకున్న తోటి స్నేహితులు రూ.22 వేలు సమకూర్చి.. ఆదివారం ప్రముఖ వైద్యుడు మల్సూర్ చేతులమీదుగా సురేశ్ భార్య, కుమార్తెకు అందించారు. కార్యక్రమంలో బానోత్ రవినాయక్, వడిత్య వీరన్న, అజ్మీరా ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు పోటు ప్రసాద్ స్మారక స్తూపావిష్కరణ

ఖమ్మంమామిళ్లగూడెం: సీపీఐ ఖమ్మం జిల్లా మాజీ కార్యదర్శి, దివంగత పోటు ప్రసాద్ స్మారక స్తూపావిష్కరణ సోమవారం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ ఖానాపురం హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్తూపాన్ని పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు ఆవిష్కరిస్తారని, బాగం హేమంతరావు, దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా, బీజీ క్లెమెంట్, మహ్మద్ సలాం, రామకృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే, ఖానాపురం హవేలీ ఏరియా సీపీఐ మహాసభ ఉదయం 11 గంటలకు పాత మమత మెడికల్ కళాశాల రోడ్డులోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్లో జరుగుతుందని వివరించారు.

సీపీఐ ప్రతిపాదనలు తీసుకోండి..

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో సీపీఐ నేతల ప్రతిపాదనలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆ పార్టీ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కమిటీ సమావేశం కాశిబోయిన అయోధ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా అర్హులకే ఇళ్లు కేటాయించాలని కోరారు. అనంతరం పట్టణ శాఖ కార్యదర్శిగా మారిశెట్టి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా కాశిబోయిన అయోధ్య, షేక్ అబ్దుల్ సలామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

3 నెలల రేషన్ పంపిణీ

తిరుమలాయపాలెం: పౌర సరఫరాల శాఖ ఆదేశాల ప్రకారం జూన్, జూలై, ఆగస్టు నెలలో పంపిణీ చేయాల్సిన సన్న బియ్యం ముందుగా ఈ నెలలోనే మూడు దఫాలుగా పంపిణీ చేయనున్నట్లు మండల తహసీల్దార్ విల్సన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభ చూపిన వారికి సన్మానం

నేలకొండపల్లి: మండల స్థాయిలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక సత్యసాయి మందిరంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు సన్మానం చేసి, మెమెంటో అందించారు. ఎంఈఓ బి.చలపతిరావు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	భైరవం, ఖలేజా
వినోద	సింగిల్
సాయిరాం	కేసరి చాప్టర్ 2
శ్రీనివాస	ఖలేజా
ఆదిత్య	కరాటే కిడ్: లెజెండ్స్

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	38		20
కాకర	46	చుక్కకూర	3
బోడ కాకర	80		20
బీర	50	తోటకూర	2
దొండ	20		10
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	96		20
గోరుచిక్కుడు	50	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	38	పుదీన	1
క్యారెట్	44		20
బీన్స్	60	-ఖమ్మం వ్యవసాయం	

అస్తవ్యస్తం

నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. నిత్యం విపరీతమైన ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య ఏళ్లుగా నగరవాసులను వేధిస్తున్నా పరిష్కారం మాత్రం లభించడం లేదు. ఎప్పుడో ఓసారి.. ఎక్కడో ఓ చోట అన్నట్లు ఉంటున్న ట్రాఫిక్ పోలీసులు పట్టనట్టే వ్యవహరిస్తుండడం వాహనదారులను మరింత వేధిస్తోంది.

– ఖమ్మంక్రైం


కమాన్ బజార్‌లో ఆగిన వాహనాలు

- ప్రధాన కూడళ్లల్లో ట్రాఫికర్
- వాహనదారులకు నిత్యనరకం

నిత్యం అదే సమస్యే

ప్రధాన కూడళ్లు అయిన కమాన్‌బజార్, కస్బాబజార్, పాత మున్సిపాలిటీ రోడ్డు నుంచి మయూరి సెంటర్ వరకు నిత్యం ట్రాఫిక్ సమస్యే. దీంతో ఆ రోడ్లు అన్ని ట్రాఫికర్‌గా మారాయి. ఆ రహదారుల గుండా వాహనాలు వెళ్లాలంటే కత్తిమీద సాములాంటిదే. జూబ్లీక్లబ్ ప్రాంతం నుంచి మయూరిసెంటర్ వైపు వాహనాలు రావాలంటే ఓవర్‌బ్రిడ్జి పైనుంచి దిగివచ్చేవరకు ఇబ్బంది ఉండదు కానీ, మయూరి సెంటర్ రాగానే అప్పుడే సమస్య మొదలవుతుంది. పాత బస్టాండ్ వరకు వాహనాలు కదలాలంటే ఒక్కో వాహనం వెళ్లాలంటే 10 నిమిషాలు పడుతోంది. కిన్నెర పాయింట్ వద్ద సిగ్నల్ పాయింట్ వలే గతంలో మయూరిసెంటర్ వద్ద కూడా సిగ్నల్ పాయింట్ ఉండేది. దీంతో ఓవర్ బ్రిడ్జిపై నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోందని దానిని తొలగించి కిన్నెర పాయింట్ వద్ద ఏర్పాటు చేశారు. అయితే మయూరిసెంటర్ ప్రాంతంలోఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమిస్తే ఆ ప్రాంతంలో కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గించవచ్చు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను ఎవరు పట్టించుకోకపోవడంతో ఏళ్ల తరబడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతూనే ఉంది. అదేవిధంగా కమాన్‌బజార్‌లోని వస్త్ర వ్యాపారం రూ.కోట్లలో నడుస్తుంటుంది. ఏన్నో ఏళ్లుగా ఈ ప్రధాన కూడళ్లలో పార్కింగ్ సదుపాయం లేక ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ నిలిచిపోతూ ఉంటుంది. పాత మున్సిపాలిటీ రోడ్డు నుంచి కిన్నెర పాయింట్ వద్దకు అక్కడి నుంచి కస్బాబజార్ వరకు నిత్యం ట్రాఫికర్ ఉంటుంది. దీంతో వాహనదారులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఇరుక్కొని బతుకుజీవుడా అంటూ బయటపడే వరకు పోరాటం చేస్తూనే ఉంటారు. ట్రాఫిక్ పోలీసులు వెంటనే స్పందించి ఈ ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.


మయూరిసెంటర్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కున్న పోలీస్ వాహనం


పాత మున్సిపాలిటీ రోడ్డులో...

కేఎంసీ షాపింగ్ కాంప్లెక్స్ తొలగింపు


షాపింగ్ కాంప్లెక్స్‌ను జేసీబీతో కూలుస్తున్న దృశ్యం


పనులు పర్యవేక్షిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం కేఎంసీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని తొలగించారు. కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ భవనాన్ని జేసీబీలతో తొలగించారు. భవనాల తొలగింపు సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ఈ మార్గంలో వాహనదారులు రాకుండా పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. దశాబ్దాల కాలంగా ఉన్న కేఎంసీ షాపింగ్ కాంప్లెక్స్ భవనం తొలగింపుతో ఆ మార్గం బోసిపోయినట్లయిందని స్థానికులు తెలిపారు.

కాలం చెల్లిన ఆహార పదార్థాల అమ్మకం

నేలకొండపల్లి: కల్తీకి తోడు కాలం చెల్లిన ఆహార పదార్థాలను వ్యాపారులు అమ్ముతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి కుటుంబంలోని చిన్నారి ఇటీవల పానీపూరి తినగా అస్వస్థతకు గురైంది. దీంతో ఆస్పత్రిలో చేర్పించాల్సి వచ్చింది. అంతేకాక బోదులబండకు చెందిన అనంతు ఉపేందర్ పిల్లల కోసం రాగితో తయారు చేసిన బిస్కెట్లు కొనుగోలు చేశాడు. వీటిని పిల్లలతో పాటు ఆయన కూడా తినగా పది నిమిషాల్లోనే కడుపు నొప్పి, శరీరంపై దద్దుర్లు వచ్చాయి. ఈ మేరకు ప్యాకెట్లను పరిశీలిస్తే గత నెల 7వ తేదీతోనే వాటి గడువు ముగిసిందని తేలింది. ఈ మేరకు ఉపేందర్ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని 327 విద్యుత్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్‌ను వివిధ జిల్లాలకు చెందిన ఆర్టిజన్లు, కార్మికుల ప్రతినిధులు కోరారు. ఆదివారం వరంగల్‌లో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఆర్టిజన్ల ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు శ్రీధర్‌ను కలిసి ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్‌ను దశలవారీగా వర్తింపజేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వల్లాల యుగంధర్, తేజావత్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రైతు సంఘం' డివిజన్ అధ్యక్షుడిగా శంకర్


బానోతు శంకర్


కుర్ర వెంకన్న

తిరుమలాయపాలెం: అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా బానోతు శంకర్, కుర్ర వెంకన్నను ఆదివారం మంగళగూడెంలో జరిగిన ప్రథమ మహాసభలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కోరారు. అందుకు ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని, పార్టీ తరఫున అండగా ఉంటామని తెలిపారు.

నేటి నుంచి 100 రోజుల ప్రణాళిక


సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లా

ఖమ్మంమయూరిసెంటర్: పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించడంతో పాటు ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనే సామర్థ్యం కలిగిన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దడమే లక్ష్యంగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను నగర పాలక సంస్థ అధికారులు రూపొందించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు వంద రోజుల పాటు నిర్వహించబోయే కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, మీడియాను భాగస్వామ్యం చేయనున్నారు. తొలి రోజున ప్రతిజ్ఞ చేయించనున్నారు. అనంతరం నగరంలో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయనున్నారు. కాగా, వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేసేందుకు కేఎంసీ అధికారులు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా పాల్గొన్నారు.

నృత్యోత్సవంలో ఆకట్టుకున్న మాన్వి

ఖమ్మంఅర్బన్: హైదరాబాద్‌లో శనివారం రాత్రి శ్రీ రాగరమ్య సంగీత, నృత్య సంస్థ ఆధ్వర్యాన 'కళా నీరాజనం–2' పేరిట నిర్వహించిన నృత్యోత్సవం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మానికి చెందిన జి.మాన్వి కూచిపూడి నృత్యంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. మమత డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటేశ్వరరావు – డాక్టర్ అనితారావు దంపతుల కుమార్తె అయిన మాన్వి శృతిలయ నృత్య విద్యాలయంలో లక్ష్మీనారాయణ వద్ద శిక్షణ పొందుతోంది.


నాట్య ప్రదర్శన అనంతరం మాన్వి

'తప్పుడు రాజకీయాలు సరికాదు'

నేలకొండపల్లి: ఓ పార్టీ దిమ్మను సాకుగా చూపిస్తూ రాజకీయం చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకుడు కొడాలి గోవిందరావు అన్నారు. నేలకొండపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కొత్తకొత్తూరులో ఓ పార్టీ దిమ్మ విషయమై వివాదాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ముడిపెట్టటం గర్హనీయమని తెలిపారు. ఎన్నికల అనంతరం ఏనాడు రాజకీయాలు మాట్లాడని మంత్రి కేవలం అభివృద్ధి పైనే దృష్టి సారించారని చెప్పారు. నియోజకవర్గం, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మంత్రి శక్తిశంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. ఇకనైనా తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని, అభివృద్ధికి సహకరించాలని గోవిందరావు హితవు పలికారు.

'అప్పుల కుప్పగా మార్చిన పాలకులు'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆవిర్భావమై 11 ఏళ్లు పూర్తయిందని, ఇప్పటివరకు పాలించిన వారంతా రాష్ట్రాన్ని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేయకపోగా.. అప్పుల కుప్పగా మార్చారని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రజలు పోరాడి ప్రత్యేక రాష్ట్రం సాధిస్తే.. ఈ 11 ఏళ్లలో పాలకులు ఆ లక్ష్యాన్ని చేరుకోకపోగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దివాలా తీయించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.75 వేల కోట్ల అప్పుతో ఏర్పడిన రాష్ట్రం ఈరోజు రూ.6.70 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, ఇంత అప్పు చేసినా సరైన అభివృద్ధి జరగలేదని చెప్పారు. ప్రభుత్వాల వైఫల్యాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఆవుల అశోక్, ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, శిరోమణి, మంగతాయి, శోభ, శ్రీను, ఆజాద్, రాకేశ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

కవి సత్యనారాయణకు 'కళారత్న'


అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరానికి చెందిన కవి బుక్కా సత్యనారాయణ సాంస్కృతిక, సామాజిక సేవలకు గుర్తింపుగా హెల్పింగ్ ఫౌండేషన్ సాంస్కృతిక సభ కళారత్న అవార్డును ప్రదానం చేసింది. శనివారం హైదరాబాద్ త్యాగరాయ గానసభ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఎండీ శిరీషారెడ్డి, సినీ నటుడు పృథ్వీరాజ్ తదితరులు అవార్డును సత్యనారాయణకు అందించారు. సత్యనారాయణకు అవార్డు రావడంపై సాహితీ సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు వెంకటస్వామినాయుడు, రామయ్య, శ్రీనివాస్, జయవాసు, గాజుల భారతి, శైలజ, శంకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఉపేందర్, వెంకటయ్య తదితరులు అభినందనలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పత్రాల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. ఈ మేరకు కాంగ్రెస్ మండల కన్వీనర్ దీప్లానాయక్ పత్రాలు అందించాక మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారి చికిత్స కోసం ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జోనబోయిన పాపయ్య, కోటేరు నర్సిరెడ్డి, తిరుమల భద్రారెడ్డి, కనతాల వెంకన్న, గుండ్ల గోవర్ధన్, తూము సత్యనారాయణ, కన్నం నరేశ్, పావురాల వెంకన్న, తోటపల్లి భిక్షం, సీపీఐ నాయకుడు గాడిపెర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మంజూరు పత్రాలు అందిస్తున్న నాయకులు

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి


మాట్లాడుతున్న వెంకటనారాయణయాదవ్

ఖమ్మంమామిళ్లగూడెం: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్క ప్రభారి కృషి చేయాలని ఖమ్మం బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు ధనియాకుల వెంకటనారాయణయాదవ్ పిలుపునిచ్చారు. టూటౌన్ పరిధిలోని 15 డివిజన్లకు ప్రభారీలను ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రకటించారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నాయకుడు, కార్యకర్త, పోలింగ్ బూత్ అధ్యక్షులు శక్తి వంచన లేకుండా పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, మందడపు సుబ్బారావు, జ్వాలా నరసింహారావుగౌడ్, రుద్రగాని మాధవ్ పాల్గొన్నారు.

మూలన పడిన చెత్తబండి

నేలకొండపల్లి: గ్రామ పంచాయతీలకు ఏడాదిన్నరగా ప్రభుత్వాల నుంచి ఎలాంటి నిధులు రాక పల్లెల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. అత్యవసర పనులకూ సైతం అవస్థలు పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లు చిన్న పంచాయతీలకు మోయలేని భారంగా మారాయి. జిల్లాలో చాలా పంచాయతీలకు ఆదాయ మార్గాలు లేక దయనీయ స్థితిలో ఉన్నాయి. ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులు లేక ట్రాక్టర్లు మరమ్మతులకు నోచుకోవటం లేదు. పంచాయతీల్లో చెత్తను తరలించేందుకు ట్రాక్టర్‌లో డీజిల్ పోయించేందుకు డబ్బులు లేక అవి మూలన పెట్టారు. రహదారుల వెంట చెత్త.. ఇళ్లల్లో భారీగా చెత్త బస్తాల్లో నిల్వ ఉంచారు. ఇటీవల కాలంలో వర్షాలు పడటంతో చెత్త తడిసి దుర్గంధం వెదజల్లుతోంది. డీజిల్‌కు డబ్బుల కోసం అప్పులు చేయలేక పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు. నెలల తరబడి ట్రాక్టర్లు చెత్త కోసం రావటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


అజయ్‌తండాలో చెత్తతో పంచాయతీ భవనం వద్దే నిలిపేసిన ట్రాక్టర్

పెద్దాస్పత్రిలో భద్రత డొల్ల..

- అధ్వానంగా సీసీ కెమెరాల నిర్వహణ
- వరుస ఘటనలతోనూ మేల్కొనని అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో భద్రత నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సీసీ కెమెరాల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో భద్రతా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇక్కడ నిత్యం వేలాది మంది రోగులు వైద్య సేవలు పొందేందుకు వస్తుంటారు. అంతే కాకుండా వందలాది మంది ఇన్‌పేషంట్లుగా చేరి చికిత్స పొందుతుంటారు. అలాగే, రోగుల సహాయకులు, ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే, ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఆస్పత్రిలో భద్రత కల్పించటంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం. అయితే, కొద్ది రోజులుగా వాటి నిర్వహణ సక్రమంగా లేకుండా పోయింది. దీంతో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి.

చోరీలు జరుగుతున్నా..

ఇటీవల ఇన్‌పేషంట్ రోగికి చెందిన ఉంగరం ఎవరో తస్కరించారు. ఆమె బంధువులు ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే, శనివారం మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి ఓ గర్భిణీ రాగా, ఆమె సహాయకుల సంచి నుంచి పర్సును చోరీ చేశారు. ఈ మేరకు వారు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు పర్సులో రూ.10 వేలు ఉన్నాయని, ఎవరో చోరీ చేశారని ఫిర్యాదు చేశారు. మే 8వ తేదీన ఎంసీహెచ్ భవనంలోని ఊయలలో ఓ 8 నెలల చిన్నారిని వదిలి వెళ్లారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది గమనించి పాపను తీసుకొని చిన్నపిల్లల వార్డుకు తరలించి చికిత్స అందించారు. అధికారులు విషయాన్ని శిశు సంరక్షణ అధికారులకు తెలియజేయటంతో ఆ పాపను శిశు గృహానికి తరలించారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవటంతో పై మూడు ఘటనల్లో నిందితులు ఎవరో గుర్తించలేకపోయారు.


సీసీ కెమెరాల పుటేజీ పరిశీలనకు సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన టీవీ

పట్టించుకోని యంత్రాంగం

చోరీలు జరిగినా.. ఇంకా ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నా బాధ్యులను గుర్తించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం. కానీ, వాటి నిర్వహణ అధ్వానంగా ఉండటంతో రోగులు, వారి సహాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 35, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 16 సీసీ కెమెరాలు గతంలో ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో ఉన్న సీసీ కెమెరాల్లో ప్రస్తుతం 14 మాత్రమే పనిచేస్తున్నాయి. కొన్ని చోట్ల కెమెరాలు పగిలిపోగా, మరికొన్ని చోట్ల దెబ్బతిన్నాయి. అయినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

పర్యవేక్షణ కరువు

సీసీ కెమెరాలు పనిచేయకపోవడం కూడా కొందరు వైద్యులు, సిబ్బందికి వరంలా మారింది. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎప్పుడు వచ్చి వెళ్తున్నారో పర్యవేక్షణ లేకుండా పోయింది. ఆస్పత్రి సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయాలకు సీసీ కెమెరాలను అనుసంధానించారు. టీవీల్లో ప్రతీ కెమెరాను పరిశీలించి వైద్యులు, సిబ్బంది, రోగులు ఏం చేస్తున్నారో గుర్తించవచ్చు. కానీ, సీసీ కెమెరాల్లో మూడింతలు పనిచేయకపోవటంతో ఎవరు ఏంచేస్తోందనేది తెలియడం లేదు. దీంతో వైద్యులు, సిబ్బందిపై కూడా పర్యవేక్షణ కరువైంది. ఇదే అదనుగా కొందరు వైద్యులు ఇలా వచ్చి అలా వెళ్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సిబ్బంది రోగుల వద్ద చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ బి.రాంబాబును వివరణ కోరగా సీసీ కెమెరాలు కొన్ని చోట్ల పనిచేయట్లేదనే విషయాన్ని గుర్తించామని, నిరంతరం పనిచేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు.